క్లుప్తంగా

సామూహిక సాయి వ్రతాలు

తిరువూరు: స్థానిక షిర్డీ సాయి కల్యాణ మండపంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం సామూహిక సాయి వ్రతాలు నిర్వహించారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబాకు విశేష పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులు సాయివ్రతాలు ఆచరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సతీష్‌కుమార్

మైలవరం: పీఆర్‌టీయూ మైలవరం మండల నూతన అధ్యక్షుడిగా సీహెచ్ సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు పి.గోపాల్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. మైలవరం జీవిత కాలపు అధ్యక్షుడిగా పి.గోపాల్‌ను ప్రకటించారు. సమావేశంలో పుల్లారెడ్డి, వెంకటేష్, సూరిబాబు, జడ్. నరసింహారెడ్డి, శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

విస్సన్నపేట: 36 ఏళ్లుగా అంకితభావంతో బోధన చేసి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉద్యోగ విరమణ చేసిన కొండా రాజ్‌కుమార్ ఆదర్శనీయుడని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. ఎ. కొండూరు మండలం కంభంపాడు హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా విస్సన్నపేటలో రాజ్‌కుమార్ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు, విస్సన్నపేట, ఎ. కొండూరు మండల ఉపాధ్యాయులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

ఇబ్రహీంపట్నం: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

లలితా సహస్ర నామ పారాయణం

మైలవరం: మైలవరంలోని ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా సామూహిక భగవద్గీత పారాయణం జరిగింది. ఆదివారం నుంచి ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని భజన సంఘాల వారిచే ప్రతి శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భజనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు.





దాహం కేకలు

- రైల్వే ట్రాక్ వద్ద పగిలిన పైప్‌లైన్
- నెల రోజులుగా దుగ్గిరాలపాడు గ్రామానికి నిలిచిన కృష్ణా వాటర్
- తాగునీటి కోసం మూడు కి.మీ. వెళుతున్న గ్రామస్తులు
- దుగ్గిరాలపాడు గ్రామస్తుల ఇబ్బందులు


దుగ్గిరాలపాడు గ్రామం ఓవర్ వ్యూ


తాగునీటి కోసం క్యాన్‌లతో బైకుపై వెళ్తున్న దుగ్గిరాలపాడు గ్రామస్తులు

జి.కొండూరు: తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న దుగ్గిరాలపాడు గ్రామానికి తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌కు సమీపంలో కృష్ణా వాటర్ పైపులైను పగిలిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పైపులైను పగిలిన ప్రదేశంలోనే రైల్వే పనులు జరుగుతుండటంతో పైపులైను మరమ్మతులకు నోచుకోక నెల రోజులుగా తాగునీరు లేక ఆ గ్రామ ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామంలో బోర్లు ఉన్నప్పటికీ తాగేందుకు పనికిరాక మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గంగినేని గ్రామం వైపు తాగునీటి కోసం పరుగులు పెడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తమకు తాగునీటి కష్టాలను తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోక..

జి.కొండూరుకు 13 కిలోమీటర్ల దూరంలోని దుగ్గిరాలపాడు గ్రామం తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుగా ఉంది. ఈ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జి.కొండూరు నుంచి చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాల మీదుగా దుగ్గిరాలపాడు వరకు కృష్ణా వాటర్ పైప్‌లైన్‌ను రెండు దశాబ్ధాల కిందట ఏర్పాటు వేశారు. ఈ పైప్‌లైన్ దుగ్గిరాలపాడు గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్ది పగిలిపోయింది. ఇదే ప్రదేశంలో రైల్వే పనులు సైతం జరుగుతుండటంతో పైప్‌లైన్ పగిలిన ప్రదేశంలో మట్టిని ఎత్తుగా గుట్టలుగా వేయడంతో పైప్‌లైన్ మరమ్మతు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. నెల రోజులుగా ఇదే తంతు కొనసాగుతుండటంతో పైప్‌లైన్ మరమ్మతులకు నోచుకోక తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

నిలిచిన 40 వేల లీటర్ల నీటి సరఫరా

దుగ్గిరాలపాడు గ్రామంలో 353 కుటుంబాలు ఉండగా 1,200మంది వరకు జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి కృష్ణా వాటర్ పైప్‌లైన్ ద్వారా ప్రతి రోజూ 30 వేలు నుంచి 40 వేల లీటర్ల వరకు మంచినీరు సరఫరా అవుతోంది. గ్రామంలో 15 వేల లీటర్లు సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు, 40 వేల లీటర్ల సామర్థ్యంతో మరో ఓవర్ హెడ్ ట్యాంకు అందుబాటులో ఉన్నాయి. వీటికి నీరు సరఫరా చేసేందుకు రెండు బోర్లు, మోటర్లు, వీటితో పాటు చేతి పంపులు పది ఉన్నాయి. అయినప్పటికీ గ్రామంలో లభించే నీటిలో ఫ్లోరైడ్ సమస్య ఉందని, గతంలో గ్రామం అంతా జ్వరాల బారినపడిన క్రమంలో ఇక్కడ ప్రజలంతా కృష్ణా వాటర్‌నే తాగునీటిగా వినియోగిస్తున్నారు. పశువులు, జీవాలకు సైతం తాగేందుకు ఈ నీటినే వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో కృష్ణా వాటర్ నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు నరకయాతన పడుతున్నారు.

మూడు కిలో మీటర్లు వెళ్లి..

దుగ్గిరాలపాడు గ్రామానికి కృష్ణా వాటర్ నిలిచిపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగినేని గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. అక్కడ కూడా కృష్ణా వాటర్ అందుబాటులో లేకపోతే డబ్బులు చెల్లించి మినరల్ వాటర్‌ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి రోజూ తాగునీటి కోసం మూడు కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మగవారు లేని సమయంలో తాగేందుకు నీళ్లు లేకపోతే పక్కింటి వారిని బదులు అడిగి తాగాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం మూడు కి.మీ. వెళుతున్నాం



కృష్ణా వాటర్ రాకపోవడంతో తాగునీటి కోసం నరకయాతన పడుతున్నాం. మూడు కిలో మీటర్లు గంగినేనికి బండి మీద వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే నెల రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. పైప్‌లైన్ ఎప్పటికి బాగు చేస్తారో తెలియడం లేదు. అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ బాగు చేసి నీటిని వదలాలి.

– తీగల గోవర్ధన్, గ్రామస్తుడు, దుగ్గిరాలపాడు

పైప్‌లైన్ బాగుచేయాలి



కృష్ణా వాటర్ రాకపోవడంతో గంగినేని గ్రామం పోయి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ పనులు ప్రారంభమైన క్రమంలో నీళ్ల కోసం అంతదూరం వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంది. రోడ్డు కూడా బాగోలేదు. అధికారులు మా గోడును పట్టించుకొని పైపులైను బాగు చేసి మా ఊరికి నీళ్లు వదలాలి.

– జడ సాంబశివరావు, గ్రామస్తుడు, దుగ్గిరాలపాడు

అధికారులు స్పందించాలి



కృష్ణా వాటర్ పైప్‌లైన్ పగిలి నెల రోజులు కావస్తున్నా మరమ్మతులు చేయకపోవడం దారుణం. దుగ్గిరాలపాడు గ్రామం అంతా తాగు నీటి కోసం నరకయాతన పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి పైప్‌లైన్ బాగు చేసి నీటిని విడుదల చేయాలి. లేదంటే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతాం.

– జడ రాంబాబు, సర్పంచ్, దుగ్గిరాలపాడు

ప్రభుత్వ వైఫల్యాలు ఇంటింటికీ తీసుకెళ్లండి

మాజీ మంత్రి జోగి రమేష్


బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, చంద్రబాబు వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'పై విస్తృత సమావేశం ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, జగ్జీవన్‌రామ్‌లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ డిజిటల్ స్క్రీన్‌పై క్యూఆర్ కోడ్ స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. గత వైఎస్సార్ సీపీలో అమలైన పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేయని తీరు, చంద్రబాబు మోసంతో మారిన పేదల ఆర్థిక స్థితిగతులను వివరించారు. జోగి రమేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదలను మోసం చేయడంలో దిట్ట అని అన్నారు. మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని కైవసం చేసుకున్న చరిత్ర ఆయనదని చెప్పారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని, కార్యకర్తలకు అన్యాయం జరిగితే సమైక్యంగా పోరాడదామని పిలుపు ఇచ్చారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని టీడీపీ సర్వేలో తేలిందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మైలవరం, జి.కొండూరు ఎంపీపీలు ఇస్లావత్ ప్రసన్నరాణి, వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్నాల తిరుపతిరావు, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, మేడపాటి నాగిరెడ్డి, పచ్చిగోళ్ల పండు, శరభయ్య, రెంటపల్లి నాగరాజు, పోరంకి శ్రీనివాసరాజు, ఈశ్వరి, వివిధ మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు మోసాలు ప్రచారం చేయండి

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి


బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న వేణుగోపాల్‌రెడ్డి, స్వామిదాసు

తిరువూరు: గత ఎన్నికల్లో మోసపు మాటలు, అబద్ధపు ప్రచారాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని పార్టీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంపై కార్యకర్తలతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి ప్రజాబలం ఉన్నా కూటమి మ్యానిఫెస్టోలోని వాగ్దానాలు వారిని ఆకర్షించాయన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని చెప్పారు. తల్లికి వందనం పథకానికి అవసరమైన బడ్జెట్‌ను విడుదల చేయకుండా నూరు శాతం విద్యార్థులకు నగదు జమ అయిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సమష్టి కృషితో విజయం సాధిద్దాం..

తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కేడర్ బలంగా ఉందని, సమష్టి కృషితో తెలుగుదేశం పార్టీని రానున్న స్థానిక ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టాలని పిలుపు నిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకుడు నరెడ్ల వీరారెడ్డి, నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు భూక్యా గన్యా, యరమల రామచంద్రారెడ్డి, కోట శామ్యూల్, మండల పరిషత్ అధ్యక్షులు కాలసాని నాగలక్ష్మి, గోగులమూడి శ్రీలక్ష్మి, గద్దల భారతి, పిల్లి మెర్సీ వనజాక్షి, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షులు తాళ్లూరి నవీన్, కావూరి వినయ్‌కుమార్, నెక్కళపు కుటుంబరావు, చలమాల సత్యనారాయణ, ఓలేటి దుర్గారావు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పల్లెపాం లక్ష్మయ్య, యరదేశి రామారావు, కలకొండ రవికుమార్, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, షేక్ జాకీర్, మోదుగు ప్రసాద్, వెదురు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు.

సమ్మె విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కొండపల్లి ఐడీఏలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్ గ్యాస్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు గోపీకృష్ణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- ఎంసీపీఐ మండల అధ్యక్షుడు కలకోటి బసవయ్య అధ్యక్షతన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడి, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు చిట్టిబాబు, కె.రత్నం, కొండలరావు, పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల పదో తరగతి 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమ తోటి విద్యార్థి, ప్రస్తుత కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు దంపతులను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

నూజివీడు: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ నూజివీడు డీడీ డాక్టర్ రమేష్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు చేశారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి గ్రామంలోని పశు వైద్యశాలలో 42 పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఎన్టీఆర్ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధులపై జంతు ప్రేమికులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి


కొండపల్లిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తిరువూరులో నివాళులర్పిస్తున్న స్వామిదాసు తదితరులు

ఇబ్రహీంపట్నం/తిరువూరు/నూజివీడు: భారత దేశ తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి, బడుగు, బలహీనవర్గాలకు అందించిన సేవలు ఎనలేనివని పలువురు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో కొండపల్లి బీ కాలనీ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లమోతు దయాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, నియోజకవర్గ అధ్యక్షుడు సందిపాము రాజేష్, టౌన్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు చందా చంటి, పట్టణ ఉపాధ్యక్షుడు వసంతరావు, రాజేష్, చందు తదితరులు పాల్గొన్నారు

- మైలవరం: స్థానిక పాత విష్ణుశ్వర హోటల్ ఎదురుగా ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- జి.కొండూరు: కుంటముక్కల గ్రామంలో సర్పంచ్ వంగూరి కుమారి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- తిరువూరు: భారత తొలి ఉప ప్రధానిజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు సుధారాణి, ఆదినారాయణ, వేణు, జాకీర్, పాపారావు, రవి, రామారావు, నాగేశ్వరరావు, నెహ్రూ, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు గొర్రె లాజరస్, మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, ముంగా జయరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు నల్లంటి సూరిరాజు, పత్తిపాటి ధనరాజు పాల్గొన్నారు.
- మైలవరం: రెడ్డిగూడెం మండలం నాగులూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు మట్టకొయ్య రాము మాట్లాడుతూ పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు జగ్జీవన్‌రామ్ అని ప్రశంసించారు. ఉప సర్పంచ్ తొమ్మండ్రు వీరయ్య, పెద్దలు మట్టకొయ్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- మైలవరం: రెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- నూజివీడు: స్థానిక అజరయ్యపేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయగిరి కృపారావు, కళ్లేపల్లి ఆదినారాయణ, యలమర్తి శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, బుద్దే వెంకటేశ్వరరావు, మట్టకొయ్య రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

మైలవరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని మైలవరంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక తిరువూరు రోడ్డు మారుతీ నగర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న రావి చెట్టుకు పూజలు చేశారు. భక్తులు యర్రంశెట్టి సుబ్బారావు, వీరమ్మ దంపతులు మహిళలకు పూలు, ఫలాలు, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. మల్లెల వెంకటేశ్వరరావు, చిన్ని, మహిళలు పాల్గొన్నారు.

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలోని వసంత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. జక్కంపూడిలోని కోదండ రామాలయంలో, కొత్తూరు తాడేపల్లి బీసీ కాలనీలోని రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

- తిరువూరు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరువూరు మండలంలోని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువూరు శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో లక్ష విరజాజులతో స్వామివారికి పూజలు నిర్వహించారు. కోదండ రామాలయంలో విష్ణు సహస్ర నామ పారాయణ, రాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయంలో 108 మామిడి పండ్లతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.
- విస్సన్నపేట: మండలంలో పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లోని రామాలయం, శివాలయంతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, విశిష్ట అలంకరణ చేశారు. స్థానిక కోదండ రామాలయంలో, నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి: మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

జూదరుల అరెస్ట్

చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేలలో ఆదివారం పేకాట శిబిరంపై తిరువూరు పోలీసులు దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

